సాక్షి
కుమురం భీం

ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



క్రీడా సంబురం
రెండు రోజుల పాటు జరిగే 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ సెపక్‌తక్రా పోటీలకు గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం వేదికైంది. 8లో▸



మాస్టర్ ప్లాన్ అమలెప్పుడో..?
కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో మాస్టర్‌ప్లాన్ అమలుకు నోచుకోవడం లేదు. పెరుగుతున్న జనాభా, వాహనాలతో రోడ్లు, మురుగు కాలువలు నరిపోని పరిస్థితి. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /22.4

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఒకటి రెండు చోట్ల జల్లులు పడొచ్చు.

న్యూస్‌రీల్

టీఏ, డీఏలు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న తుమ్మల లచ్చిరాం

కాగజ్‌నగర్‌టౌన్: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ బిల్లులు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలయ్యే విధంగా ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి చేయడం బాధాకరమన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భానుప్రకాష్, ప్రధాన కార్యదర్శి సదాశివ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర బాధ్యులు రాంరెడ్డి, దామోదర్, కిరణ్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజావాణి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రేపటి నుంచి యథావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ నిలిచిపోవడంతో మళ్లీ పునరుద్ధరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్జీదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాల్యవివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శనివారం సిర్పూర్(టి) మండలంలోని వేంపల్లిలో బాల్యవివాహాలు, చట్టాలు, గ్యాస్ సిలిండర్ వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలను పనుల్లో పెట్టకూడదన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ గణపతి, తిలావత్, రమేష్, దత్తాత్రేయ, గ్రామస్తులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

17న ఆర్ఎస్పీ పాదయాత్ర

బెజ్జూర్: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎస్. ప్రవీణ్ కుమార్ ఈ నెల 17న బెజ్జూర్ మండలంలోని కుష్ణపల్లి నుంచి దిందా గ్రామం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకుడు అర్షద్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాదయాత్రకు మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రైతుల కోసమే ధన ధాన్య కృషి యోజన

బెల్లంపల్లి: రైతుల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం ధన ధాన్య కృషి యోజన, పుప్పుధాన్యాల స్వావలంబన మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.ప్రసూన అన్నారు. శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఢిల్లీలో మిషన్ కార్యక్రమాన్ని ప్రారంభించగా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల రైతులు హాజరయ్యారు. కేవీకే శాస్త్రవేత్తలు ప్రియ సుగంధి, మహేష్, స్రవంతి, సాధ్వి, నాగరాజు, కుమురంభీం సేంద్రియ ఉత్పత్తిదారుల పరస్పర సొసైటీ డైరెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

చెరువుకు చేరని చేప

- పూర్తి కాని టెండర్ల ప్రక్రియ
- ఎన్నికల నేపథ్యంలో జాప్యం
- చేప పిల్లల కోసం మత్స్యకారుల నిరీక్షణ
- వారం రోజుల్లో విడుదలకు సిద్ధం



జిల్లాలోని చెరువుల వివరాలు

మండలం	చెరువులు
ఆసిఫాబాద్	11
జైనూర్	16
కెరమెరి	5
లింగాపూర్	5
తిర్యాని	12
వాంకిడి	19
రెబ్బెన	38
సిర్పూర్(యూ)	5
బెజ్జూర్	27
చింతలమానెపల్లి	20
దహెగాం	12
కాగజ్‌నగర్	31
కౌటాల	24
పెంచికల్‌పేట్	26
సిర్పూర్(టి)	25
మొత్తం	276

కెరమెరి: మత్స్యకారుల ఉపాధికి దోహద పడుతున్న ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం జిల్లాలో సక్రమంగా ముందుకు సాగడం లేదు. గతేడాది ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ ఆలస్యంగా చేపట్టింది. బిల్లులు అందలేదని కాంట్రాక్టర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో అదును దాటిన తర్వాత రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలారు. అవి సరిగ్గా ఎదగక పోవడంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా ప్రభుత్వం టెండర్ల ప్రక్రియను ఆలస్యంగా ప్రారంభించింది. గత నెల చివరి వరకు చేప పిల్లల పంపిణీ జరుగుతుందని భావించినా టెండర్ల ప్రక్రియ ఇప్పటికీ ముగియలేదు. జిల్లాలో చేపపిల్లల పంపిణీకి ఇద్దరే టెండర్లు వేసినా ఇప్పటి వరకు అది పూర్తి కాలేదు. మొన్నటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం బిజీగా ఉండడంతో టెండర్ల ప్రక్రియ పూర్తి కాలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఎన్నికలకు స్టే విధించడంతో ఇక చేపపిల్లల టెండర్ల ప్రక్రియ త్వరలో ముగియనుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఆలస్యంతో ఎదగని చేపలు

ఏటా చేప పిల్లల పంపిణీలో జాప్యం జరుగుతోంది. చెరువుల్లో వదిలే చేపపిల్లల సైజు 34 నుంచి 40 మిల్లీ మీటర్లు ఉంటుంది. అవి ఎదగడానికి ఆరు నెలల సమయం పడుతుంది. ఆ లోపు చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోతుంది. చేపలు ఎక్కువ బరువు పెరగాలంటే ఫిబ్రవరి వరకు ఆగాల్సి ఉంటుంది. ఇప్పటికే నీటిమట్టాలు తగ్గిపోవడంతో చేపల ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. దీంతో ఏటా మత్స్యకారులు నష్టపోతున్నారు. గతంలో ప్రతీ సంవత్సరం రెండు కోట్ల చేప పిల్లల పంపిణీ జరిగేది. గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని సగానికి పైగా తగ్గించింది. కేవలం 74 లక్షల చేప పిల్లలు మాత్రమే వదిలారు. దీనివల్ల కూడా మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది కూడా ఆగస్టులో చేప పిల్లలు వదలాల్సి ఉండగా సెప్టెంబర్ 16 నుంచి వదలడం ప్రారంభించారు.

జిల్లాలో 74 సంఘాలు

జిల్లాలో 74 మత్స్యకార సంఘాలు ఉన్నాయి. వాటిలో 2,950 మంది సభ్యులు ఉన్నారు. వారంతా ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో 1.44 కోట్ల చేపలు చెరువుల్లో వేసేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో చిన్న చెరువులు 261, రిజర్వాయర్లు 4, పెద్ద చెరువులు 11 ఉన్నాయి. ఇందులో 34 నుంచి 40 మిల్లీమీటర్ల సైజు ఉన్న చేప పిల్లలు వదులుతారు. చిన్న చెరువుల్లో 66 లక్షలు, పెద్ద చెరువులు, రిజర్వాయర్లలో 78 లక్షల చేపలను వదలనున్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురియడంతో చెరువులు, రిజర్వాయర్లు నీటితో కళకళలాడుతున్నాయి. నిన్నటి వరకు కూడా జిల్లాలో వానలు పడుతూనే ఉండడంతో మరో పక్షం రోజుల వరకు కూడా చేపలు వేసినా ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు పేర్కొంటున్నారు.

వారంలోగా వదులుతాం

టెండర్ల ప్రక్రియ చివరి దశకు వచ్చింది. జిల్లాలో ఇద్దరే టెండర్ వేశారు. సోమ, మంగళవారాల్లో టెండర్ ప్రక్రియ పూర్తవుతుంది. వారం రోజుల్లోగా చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదులుతాం. నీరు పుష్కలంగా ఉంది. చేపలకు ఎలాంటి హాని జరగదు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బిజీగా ఉండడం వల్ల కాస్త జాప్యం జరిగింది. – సాంబశివరావు, ఏడీ

మళ్లీ సాగునీటి సంఘాలు!

- ఏర్పాటుకు సన్నాహాలు
- నీటి వనరులపై పర్యవేక్షణ
- చెరువుల అభివృద్ధి
- ఆయకట్టుకు రైతులకు తొలగనున్న ఇక్కట్లు



ఎల్లూర్‌లోని బొక్కివాగు చెరువు

ఆసిఫాబాద్‌అర్బన్: వ్యవసాయ రంగానికి సాగునీటిని అందించేందుకు గతంలో సంఘాల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉండేది. కానీ 16 సంవత్సరాలుగా సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో పర్యవేక్షణ లోపించి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైతుల సమస్యలు తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ విషయాన్ని ప్రకటించారు. సాగునీటి సంఘాల ఏర్పాటుతో మిషన్ కాకతీయ అధికారులకు పనిభారం తగ్గడమే కాకుండా నీటి వనరుల పర్యవేక్షణ మెరుగుపడనుంది. ఉమ్మడి రాష్ట్రంలో చెరువులు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా నీటి వినియోగదారుల సంఘాలు ఉండేవి. ఆయా చెరువులు, ప్రాజెక్టులను వారే పర్యవేక్షించేవారు. వాటి పరిధిలో ఏంజరిగినా అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. సత్వర పరిష్కారానికి కృషి చేసేవారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. చెరువులు, ప్రాజెక్టుల వద్ద ఏ పని జరిగినా అధికారుల పర్యవేక్షణలోనే నిర్వహిస్తూ వస్తున్నారు. ఫలితంగా నీటి వనరుల సమస్యలను గుర్తించడంలో జాప్యం జరిగి నష్టం వాటిల్లుతోంది. అంతే కాకుండా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడం లేదు. అదనపు ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో నిర్మించిన కాల్వల్లో ఆశించిన స్థాయిలో సాగునీరు రావడం లేదు. అదే సంఘాలు ఉంటే సభ్యులుగా ఉండే రైతులు,అధికారుల సమన్వయంతో ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.

16 ఏళ్లుగా ఎన్నికల ఊసెత్తని ప్రభుత్వం..

జిల్లాలో వంద ఎకరాల ఆయకట్టు, అంతకంటే ఎక్కువగా ఉన్న చెరువులు మొత్తం 544 ఉన్నాయి. ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో 231 చెరువుల కింద 46,571 ఎకరాల సాగు భూమి ఉండగా, కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 313 చెరువుల పరిధిలో 36,525 ఎకరాలు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 2006లో వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువులకు సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశారు. వాటి పదవీకాలం 2008లో ముగిసింది. అప్పటి నుంచి మళ్లీ ఎన్నికలు నిర్వహించలేదు. తెలంగాణ ప్రభుత్వం వచ్చినా నీటి సంఘాల ఎన్నికల ఊసెత్తలేదు. గత ప్రభుత్వ హయంలో చెరువుల పునరుద్ధరణ కోసం మిషన్ కాకతీయ పనులు చేపట్టారు. కానీ నీటి సంఘాలు లేకపోవడంతో కాంట్రాక్టర్‌లు తుతూ మంత్రంగా పనులు చేపట్టి చేతులెత్తేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం చెరువుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సాగునీటి సంఘాల ఎన్నికలను త్వరగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

ఎన్నికల నిర్వహణ ఇలా..

గత ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగానే వంద ఎకరాల ఆయకట్టు ఉన్న ప్రధాన చెరువుల ఆయకట్టు రైతులు చైర్మన్‌తో పాటు డైరెక్టర్‌లను ఎన్నుకునేవారు. పాలకవర్గ సభ్యులు చెరువుల నిర్వహణతో పాటు నీటిని పంట పొలాలకు పొదుపుగా వాడుకునేలా చర్యలు చేపట్టేవారు. అంతేకాకుండా రైతులను సమన్వయ పర్చుకుంటూ అభివృద్ధి పనులు నిర్వహించేవారు. కానీ పదహారేళ్లుగా ఎన్నికలు నిర్వహించకపోవడంతో చెరువుల నిర్వహణ మందగించింది.

సాగునీరు వినియోగం



నీటి సంఘాలతోనే చెరువులు అభివృద్ధి చెందుతాయి. గతంలో నీటి సంఘాలు ఉండడంతో నీటిని పొదుపుగా వాడుకోవడమే కాకుండా వారి పర్యవేక్షణ కూడా పకడ్బందీగా ఉండేది. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంతో చెరువులను పునరుద్దరించినా అక్కడక్కడ నాణ్యత లోపించింది. ఇప్పటికైనా నీటి సంఘాలను ఎన్నుకుని చెరువులను అభివృద్ధి చేయాలి. – గద్దల శంకర్, రైతు, మోతుగూడ

వ్యవసాయానికి మేలు

చెరువుల పర్యవేక్షణ కోసం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ ఆలోచనతో వ్యవసాయానికి మేలు జరుగుతుంది. గతంలో చెరువుల అభివృద్ధి పనులు నీటి సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లు చూసుకునేవారు. ప్రస్తుతం వారు లేకపోవడంతో మేమే పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వం నీటి సంఘాలను ఎన్నుకుంటే మాపై పనిభారం తగ్గుతుంది. – అన్నాజీరావ్, డీఈఈ, ఆసిఫాబాద్

కోర్టు భవన నిర్మాణం చేపట్టాలి



హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో నూతన కోర్టు భవన నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ ఆసిఫాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టు ఫోలియో జడ్జి భీమపాక నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాలలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కోర్టు భవన నిర్మాణానికి భూమిపూజ సందర్భంగా విచ్చేసిన ఆయనను స్థానిక న్యాయవాదులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రూ.12 కోట్లతో కోర్టు భవన సముదాయాలు మంజూరు చేయగా జిల్లాకు మాత్రం నిధులు కేటాయించలేదన్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమిని కోర్టు నిర్మాణానికి కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం న్యాయమూర్తిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక న్యాయవాదులు బోనగిరి సతీశ్ బాబు, నరహరి, ముక్త సురేశ్, రాజీవ్‌రెడ్డి, జగన్మోహన్ రావు, రామకృష్ణ, సత్యశ్రీలత, శ్రీవాణి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: గురుకుల ఉపాధ్యాయుల వేతనాలు వెంటనే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. శనివారం మండలంలోని బలగాల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలలు గడుస్తున్నా వేతనాలు రాకుండా గురుకుల ఉపాధ్యాయులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రెగ్యులర్ స్కేల్ అమలు చేయాలని, గెస్ట్, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు మంజూరు చేయాలని, మినిమం టైం స్కేల్ వర్తింప జేయాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజ్‌కమలాకర్‌రెడ్డి, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు మైపాల్, జిల్లా కమిటీ సభ్యుడు మహేష్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టం వజ్రాయుధం లాంటిది

- జీఎం విజయ భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి

రెబ్బెన: సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జీఎం మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, అధికారుల్లో జవాబుదారీతనం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టమే సమాచార హక్కు చట్టమన్నారు. ప్రతీఒక్కరు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అయితే ఈ చట్టాన్ని సమాజ ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని, స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని సూచించారు. వ్యక్తుల వ్యక్తిగత సమాచారం, దేశ రక్షణ రహస్యాల విషయంలో ఈ చట్టం ద్వారా సమాచారాన్ని పొందలేమన్నారు. చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటే సత్ఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు మచ్చగిరి నరేందర్, ఎస్వోటూ జీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్ కుమార్, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, ఏఐటీయూసీ నాయకుడు కిరణ్, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక

- ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్‌కుమార్



మాట్లాడుతున్న ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్‌కుమార్, పీసీసీ పరిశీలకులు శ్రీనివాస్, అనిల్ కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: డీసీసీ అధ్యక్ష ఎన్నికను ఎలాంటి అపోహలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తామని ఏఐసీసీ ప్రతినిధి డాక్టర్ నరేష్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో పీసీసీ పరిశీలకులు శ్రీనివాస్, అనిల్‌కుమార్, జ్యోతి, పీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణక్క, ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం 10:30 గంటలకు జిల్లా కేంద్రంలోని అటవీశాఖ గెస్ట్‌హౌజ్‌లో డీసీసీ సమావేశం, మధ్యాహ్నం సిర్పూర్ నియోజకవర్గ సమావేశం, 13న జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ స్థాయి సమావేశం, 14న సాధారణ ప్రజలతో పాటు మేధావుల అభిప్రాయ సేకరణ, 19న పోటీలో ఉన్న అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాంటి ఒత్తిళ్లకు, పైరవీలకు తావులేకుండా జిల్లా అధ్యక్షుడిని ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. రెండు జిల్లాల్లో పర్యటించి నివేదికను అధిష్టానానికి అందించనున్నట్లు పేర్కొన్నారు. యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గుండా శ్యాం, మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాదెవేణి మల్లేశ్, నాయకులు అనీల్‌గౌడ్, అబ్దుల్లా, మునీర్ పాల్గొన్నారు.

డీసీసీల ఎంపికకు కసరత్తు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి జిల్లాలో డీసీసీ(జిల్లా కాంగ్రెస్ కమిటీ), నగర అధ్యక్షుల ఎంపిక కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తు మొదలైంది. ఆయా జిల్లా పార్టీ బాధ్యతలు అప్పగించేందుకు సరైన నాయకులను ఎంపిక చేసేందుకు పార్టీ ప్రత్యేకంగా పరిశీలకులను నియమించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్(ఎంపీ), సీహెచ్.రాంభూపాల్, లకావత్ ధన్వంతి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, కుమురంభీంఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, రాష్ట్ర నాయకులు డా.పులి అనిల్‌కుమార్, అడువాల జ్యోతి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించింది. పరిశీలకులు నాలుగు జిల్లాల పరిధిలోని పది నియోజకవర్గాల్లో పర్యటించి, నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతున్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రస్తుతం పరిశీలకులు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా పరిశీలకులకు పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎవరెవరు పోటీ పడుతున్నారు? ఆసక్తి గల నాయకుల నుంచి వివరాలు సేకరించడంతోపాటు సామర్థ్యం, డీసీసీ ఎంపికలో జిల్లా పరిస్థితులను అంచనా వేస్తూ అధిష్టానానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ క్రమంలో కొత్త అధ్యక్షుల ఖరారులో ఏఐసీసీ పరిశీలకుల పర్యటన కీలకంగా మారింది.

ఓసీపీలో ఉద్రిక్తత

- వేతనాల కోసం ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- ఏరియా జీఎం ఘెరావ్



జీఎంను ఘెరావ్ చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ కాంట్రాక్టు కార్మికులు శనివారం ఆందోళనను ఉధృతం చేశారు. బొగ్గు ఉత్పత్తిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఓసీపీలో ఓబీ పనులు నిర్వహించే సీఆర్ఆర్ సంస్థ నెలన్నర క్రితం పనులు నిలిపివేసింది. నాలుగు నెలల వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు క్వారీలోకి దిగి వాహనాలను అడ్డుకున్నారు. అనంతరం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. అక్కడే టెంటు వేసుకుని భోజనాలు చేసి రాత్రి వరకు ఆందోళన కొనసాగించారు.

అధికారులపై ఆగ్రహం..

కాంట్రాక్ట్ కార్మికులతో శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజెంట్ రాజేందర్, ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, మేనేజర్ ఐ.శ్రీనివాస్ ఇతర అధికారులు చర్చించారు. కంపెనీ పరిధిలోని చర్యలన్నీ తీసుకుంటున్నామని చెప్పినా కార్మికులు వినలేదు. జీఎంను ఘెరావ్ చేసి రోడ్డుపైనే నిర్బంధించారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ తమను ఇబ్బందులకు గురి చేస్తుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదంటూ రాత్రి వరకు అధికారులను ఎటూ కదలనీయకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు కార్మికులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. కంపెనీ జీపు కమాన్ బయటకు వెళ్లడానికి ప్రయత్నించగా కార్మికులు అడ్డుకుని దాడికి యత్నించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కంపెనీ సెక్యూరిటీ గార్డులను పెద్దఎత్తున మోహరించారు.

కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు

జీతాలు ఇవ్వకుండా మోసం చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కంపెనీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయాలని కార్మికులు పట్టుబట్టారు. దీంతో ఓసీపీ పీవో పేరుతో సదరు కాంట్రాక్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఆర్ఆర్ సంస్థ కాంట్రాక్ట్ కార్మికులు ఐత కిష్టయ్య, జెట్టి రమేశ్, పెద్దపల్లి సురేశ్, జక్కుల రాజలింగు, సిరిపురం శ్రీను, సన్నిగౌడ్, బొడ్డు తిరుపతి, తోట రాజేశ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగింది.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



క్రీడాకారులతో ఎస్టేట్స్ అధికారి సాగర్

రెబ్బెన: క్రీడాకారులు పోటీల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని బెల్లంపల్లి ఏరియా ఎస్టేట్స్ అధికారి వి.సాగర్ అన్నారు. శనివారం గోలేటిలోని భీమన్న స్టేడియంలో 92వ డబ్ల్యూపీఎస్ వార్షిక క్రీడల్లో భాగంగా డిపార్టుమెంట్ బాస్కెట్ బాల్ పోటీలను నిర్వహించారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను పట్టించుకోకుండా నిరంతరం సాధన చేస్తే విజయాలు సొంతం అవుతాయన్నారు. సంస్థలో పనిచేసే ఉద్యోగ క్రీడాకారులు మంచి క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తూ కోలిండియా స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో ఖైరిగూడ పీవో జట్టుపై ఎస్‌వోటూ జీఎం జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమాల్లో సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అన్వేష్, జనరల్ క్యాప్టెన్ కిరణ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో చోరీ


బీరువాలో చిందరవందరంగా పడి ఉన్న వస్తువులు

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామంలో దుర్ల రాజలింగు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. సమీప బంధువులు చనిపోవడతో రాజలింగు కుటుంబంతో కలిసి మూడు రోజుల క్రితం ఊరికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి ఉన్న కిటికీలోంచి లోపలికి చొరబడ్డారు. బీరువా తలుపులు పగులగొట్టి మూడు తులాల బంగారం, 25 వేల నగదును ఎత్తుకెళ్లారు. శనివారం స్థానికులు గమనించారు. వెంటనే అందించిన సమాచారంతో ఎస్సై గౌతమ్ పవర్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో తనిఖీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండోరోజు కొనసాగిన గాలింపు


పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వహీదుద్దీన్

దహెగాం: మండలంలోని బొర్లకుంట గ్రామానికి చెందిన జుమ్మిడి మధుకర్ శుక్రవారం ఓ కార్యక్రమానికి వెళ్లి వాగులో స్నానం చేస్తుండగా గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో రెండోరోజు శనివారం గజ ఈతగాళ్లతో గాలింపు కొనసాగింది. సాయంత్రం చీకటిపడే వరకు ఆచూకీ లభ్యం కాలేదు. డీడీఆర్ఎఫ్ టీంతో గాలింపు చేపడతామని డీఎస్పీ వహీదుద్దీన్ తెలిపారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. ఎస్సైలు, సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన వ్యక్తి రిమాండ్ తరలించినట్లు సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తలమడుగు మండలంలోని మందగూడకు చెందిన భీంరావు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు. అదే మండలంలోని ఉమ్రికి చెందిన వరుసకు బావ మరిది అయిన కుమ్ర నగేశ్ అతనికి రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రెండేళ్ల క్రితం రూ.20 వేలు తీసుకున్నాడు. ఇప్పటివరకు ఉద్యోగం ఇప్పించకపోగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదు. ఫోన్ చేసిన, ఇంటికి వెళ్లిన స్పందించకపోవడంతో శనివారం బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని కుమ్ర నగేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

క్రీడా సంబురం

- గోలేటిలో ప్రారంభమైన సెపక్‌తక్రా రాష్ట్రస్థాయి పోటీలు
- తరలివచ్చిన క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన జీఎం విజయభాస్కర్‌రెడ్డి


క్రీడా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జీఎం విజయ భాస్కర్‌రెడ్డి


తలపడుతున్న ఖమ్మం-వరంగల్ జిల్లా జట్ల క్రీడాకారులు

రెబ్బెన: క్రీడా సంబురం మొదలైంది. రెండు రోజుల పాటు జరిగే 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ సెపక్‌తక్రా పోటీలకు మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానం వేదికైంది. రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, క్రీడాభిమానులతో మైదానం కోలాహలంగా మారింది. శనివారం ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి క్రీడా పతకాలను ఆవిష్కరించి క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆపై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. సుమారు 200 మంది క్రీడాకారులు, 50 మంది కోచ్‌లు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలకు గోలేటి ప్రాంతం పుట్టినిల్లు లాంటిదని అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పోటీల్లో రాణిస్తూ మంచి గుర్తింపు పొందారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలను గోలేటిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. సెపక్‌తక్రా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

పీడీ కావడమే నా లక్ష్యం



పీడీ కావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. పదో తరగతి చదువుతూ సెపక్‌తక్రా పోటీల్లో రాణిస్తున్నాను. నేషనల్ పోటీల్లో ఒకసారి, నాలుగు సార్లు స్టేట్స్ మీట్‌లో పాల్గొన్నాను. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో బ్రౌంజ్ మెడల్స్ సాధించాను. రాష్ట్ర జట్టుకు, ఉమ్మడి వరంగల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాను. – బి.స్వప్న, వరంగల్

ఈ ఆట భిన్నమైనది



సెపక్‌తక్రా ఆట భిన్నమైనది. కేవలం కాళ్ల సహాయంతోనే ఆడాల్సి ఉంటుంది. నాలుగేళ్ల నుంచి ఆడుతున్నా. ఒకసారి నేషనల్స్‌కు సెలెక్ట్ అయ్యాను. ఇప్పటి వరకు మూడుసార్లు స్టేట్ మీట్‌లో ఆడితే ఒకసారి గోల్డ్‌మెడల్ సాధించాను. – నిఖిల్, వరంగల్

బంగారు పతకం సాధిస్తా



మూడేళ్లుగా సెపక్‌తక్రా ఆడుతున్నా. ఒకసారి నేషనల్స్‌లో, రెండు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించాను. ఈసారి బంగారు పతకం సాధిస్తాను. – ఆర్.విష్ణువర్ధన్, మహబూబ్‌నగర్

సెపక్‌తక్రా అంటే ఇష్టం



నాకు సెపక్‌తక్రా అంటే ఎంతో ఇష్టం. ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నా. 8వ తరగతి నుంచి ఆడటం నేర్చుకున్నా. ఆటపై ఉన్న ఇష్టంతో పోటీల్లో రాణిస్తున్నా. రాష్ట్రస్థాయి పోటీల్లో నాలుగు బంగారు, ఒకసారి వెండి పతకం సాధించాను. – పి.అభినవ్ రాణా, రంగారెడ్డి

ఫస్ట్‌ప్లేస్ సాధిస్తాం



సొంత జిల్లాలో జరుగుతున్న ఈ పోటీల్లో ఫస్ట్‌ప్లేస్ సాధిస్తామనే నమ్మకం ఉంది. దానికి తగినట్లుగా ఆటతీరును ప్రదర్శిస్తాం. ఇప్పటి వరకు మూడు సార్లు స్టేట్ మీట్‌ను ఆడాను. త్వరలో గోవాలో జరగబోయే నేషనల్స్ పోటీల్లో పాల్గొనబోతున్నా. – అభినయ రమ్యశ్రీ, ఆదిలాబాద్

ఆత్మవిశ్వాసంతో ఆడుతాం



జిల్లా జట్టు క్రీడాకారులు ఆత్మ విశ్వాసంతో పోటీల్లో దిగుతున్నాం. ఇప్పటి వరకు ఒకసారి నేషనల్స్, మూడుసార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. ఒకసారి మూడోస్థానంలో సాధించాను. ఈసారి బంగారు పతకం సాధిస్తాను. – కె.రాంచరణ్, ఆదిలాబాద్

గతేడాది నుంచే ఆడుతున్నా



గతేడాది నుంచే సెపక్‌తక్రా మొదలుపెట్టాను. కోచ్, క్రీడాకారుల ప్రోత్సాహం ఇస్తున్నారు. గతంలో నేషనల్ పోటీల్లో పాల్గొన్నా ప్లేస్ రా లేదు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడోస్థానం సాధించాను. ఈసారి ఫస్ట్ ప్లేస్ కోసం ప్రయత్నిస్తున్నా. – సింగసాని అశ్విత, కరీంనగర్

జిల్లాకు చేరిన భారత్ అన్నశుద్ధి యాత్ర


కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకంతో గౌరవ్ త్యాగి

కైలాస్‌నగర్: దేశంలోని ప్రతి వ్యక్తికి శుద్ధమైన ఆహారం అందాలనే ఉద్దేశంతో గౌరవ్ త్యాగి అనే యువకుడు చేపట్టిన భారత్ అన్నశుద్ధి యాత్ర శనివారం జిల్లా కేంద్రానికి చేరింది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని హపూర్ జిల్లా హైదర్‌పూర్‌కు చెందిన త్యాగి జూన్ 26న శ్రీనగర్‌లోని లాల్‌చౌక్ నుంచి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేపట్టారు. బాల్య స్నేహితులు రాజత్ భారతి, రియాజ్‌తో కలిసి ప్రతీరోజు 25 నుంచి 30 కి.మీ పాదయాత్ర చేస్తున్నారు. ఇప్పటివరకు 12 రాష్ట్రాల్లో పాదయాత్ర పూర్తి చేసిన ఆయన మహారాష్ట్ర మీదుగా జిల్లాకు చేరుకున్నారు. పాఠశాల విద్యార్థులు, గృహిణిలు, రైతులను కలుస్తూ ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఇప్పటివరకు 50 వేల మంది చిన్నారులను కలిసి జంక్ ఫుడ్ తినొద్దని ప్రతిజ్ఞచేయించినట్లు తెలిపారు.

పోకిరీలకు కౌన్సెలింగ్

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, రద్దీ ప్రాంతాలు, విద్యాసంస్థల వద్ద షీటీమ్ పోలీసులు మఫ్టీలో ఉండి డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద, మినీ బస్టాండ్ వద్ద శనివారం నలుగురు పోకిరీ యువకులను అదుపులో తీసుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు. షీ టీమ్ ఎస్సై ఉషారాణి, పోలీసులు శ్రావణ్‌కుమార్, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

- రాష్ట్ర అటవీశాఖ చీఫ్ కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి


పోటీలు ప్రారంభిస్తున్న అటవీ అధికారులు

నిర్మల్‌టౌన్: అటవీ ఉద్యోగుల్లో ఒత్తిడిని దూరం చేసేందుకు క్రీడలు నిర్వహిస్తున్నామని రాష్ట్రఅటవీశాఖ చీఫ్ కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ నిర్వహించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, వాకింగ్, చెస్, లాంగ్ జంప్, షాట్‌పుట్, క్యారమ్, జావలిన్ త్రో, తదితర క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగులకు మానసికోల్లాసం, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం కోసం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు సంబంధించిన సుమారు 350 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారం వరకు పోటీలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్, నిజామాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ డీఎఫ్‌ఓలు వికాస్ మీనా, రేవంత్ చంద్ర, నాగిని భాను, అధికారులు కుమారి చిన్న, సుధాకర్, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

4 కి.మీ కాలినడకన వెళ్లి.. వైద్యం అందించి


కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన మంగ్లీ వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం లేదు. మండల వైద్యాధికారి సర్ఫరాజ్, సిబ్బంది 4 కి.మీ కాలినడకన వెళ్లి శనివారం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి మాత్రలు అందజేశారు. పిల్లలకు ఇమ్యూనైజేషన్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి సర్ఫరాజ్ మాట్లాడుతూ గ్రామంలో 11 ఇళ్లు ఉండగా, 64 మంది జనాభా ఉన్నారని పేర్కొన్నారు. అనారోగ్యం బారినపడితే వెంటనే పీహెచ్‌సీకి, రిమ్స్‌కు వెళ్లి చికిత్స చేసుకోవాలన్నారు. అంకోలి పీహెచ్‌సీ హెల్త్ సూపర్ వైజర్ బొమ్మేత సుభాష్, హెల్త్ అసిస్టెంట్స్ వేణుతాయి, పవర్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ నారాయణ, ఆశకార్యకర్తలు సుమిత్ర, రుక్మిణి, దుర్పత బాయి, గ్రామస్తులు ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో ముగ్గురు బలవన్మరణం చెందారు. బావిలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకోగా, మద్యానికి బానిసైన యువకుడు, వెన్నునొప్పితో బాధ పడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకున్నారు.

బావిలో దూకి ఒకరు..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రెండో ఎస్సై రామయ్య

లక్సెట్టిపేట: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన సొటేపల్లి మౌళి (32), సంజన దంపతులు. వీరికి పది నెలల కుమారుడు ఉన్నాడు. మౌళి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్తున్నానని భార్యతో చెప్పి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతకుతుండగా లక్సెట్టిపేట మండలం దౌడపల్లి శివారులోని వ్యవసాయ బావి ఒడ్డున చెప్పులు, సెల్‌ఫోన్ కనిపించాయి. బావిలో గాలించగా మృతదేహం లభించింది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని రెండో ఎస్సై రామయ్య పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడవచ్చని తండ్రి లచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. ఆయన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు..

ఆదిలాబాద్‌టౌన్: మద్యానికి బానిసైన యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ కె.నాగరాజు కథనం ప్రకారం..పట్టణంలోని తాటిగూడకు చెందిన కుమ్ర రుషికేష్ (24) మద్యానికి బానిసయ్యాడు. కుటుంబీకులు మందలించడంతో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంటి ఎదుట ఉన్న చెట్టుకు ఉరేసుకున్నాడు. తండ్రి ప్రభు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి..


నర్సయ్య (ఫైల్)

నర్సాపూర్(జి): వెన్నునొప్పితో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లి నర్సయ్య (45), లక్ష్మి దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. నర్సయ్య రెండేళ్లుగా వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నయంకాలేదు. ఈక్రమంలో జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్ట్



వెల్లడిస్తున్న ఎస్సై రాజశేఖర్

మందమర్రిరూరల్: గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సై రాజశేఖర్ వివరాలు వెల్లడించారు. కాగజ్‌నగర్ నుంచి గంజాయి తీసుకువస్తున్నారనే సమాచారంతో జాతీయ రహదారి టోల్‌గేట్ వద్ద తనిఖీ చేపట్టారు. స్కూటీపై వచ్చిన ముగ్గురిని తనిఖీ చేయగా 100 గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని స్కూటీతోపాటు వేల్పుల వర్షిత్ (పొన్నారం), వేల్పుల రాహుల్ (ఆదిల్‌పేట్), మణిదీప్ (నస్పూర్)ను అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బహుదూరపు బాటసారులు

- గొర్రెల మేత కోసం ఇతరప్రాంతాలకు కాపరులు
- ఏడాదిలో మూడునెలలు ఇంటికి దూరం
- వృత్తిని నమ్ముకుని జీవనం

నిర్మల్ జిల్లాలో..

జీవాలు	సంఖ్య
గొర్రెలు	3.50 లక్షలు
మేకలు	1.25 లక్షలు

వారంతా తమ కులవృత్తి అయిన గొర్రెల పెంపకాన్ని నమ్ముకొని జీవనం సాగించే యాదవులు. ఉన్న ఊరిలో జీవాలకు గ్రాసం దొరకకపోవడంతో పెంపకందారులు బృందంగా ఏర్పడి ఆదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఏడాదిలో మూడు నెలలు అడవిలో ఉంటూ వండుకొని తింటారు. తమ జీవనోపాధితోపాటు జీవాల మేత కోసం వందల కిలోమీటర్లు ప్రయాణం చేస్తున్న బాటసారులపై ప్రత్యేక కథనం.


ధర్మోర నుంచి మేతకు వెళ్తున్న గొర్రెలు


కాపరుల వంటావార్పు

లోకేశ్వరం: మండలంలోని రాజూర, వట్టోలి, ధర్మోర, కన్కపూర్ గ్రామాల గొర్రెల కాపరులు బహుదూరపు బాటసారులు. ఏడాదిలో మూడు నెలలు ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో గొర్రెల మందతోపాటు మేత కోసం తిరుగుతూనే ఉంటారు. నిర్మల్ జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాన్ని అనుకుని ఉండటంతో ఇక్కడి గొర్రెలు, మేకల పెంపకందారుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఎస్సారెస్పీ నిండనంత వరకు వెనుకభాగం పశుగ్రాసం లభిస్తుండటంతో రోజూ ఉదయం, సాయంత్రం వరకు జీవాలను మేపుతుంటారు. ఏటా జూలై, ఆగస్టులో ఎస్సారెస్పీ నిండుకుండలా మారుతుంది. వెనుక భాగం నీటితో నిండి ఉంటుంది. దీంతో జీవాలకు గ్రాసం దొరకక వలస వెళ్లాల్సిన పరిస్థితి. వీరంతా మళ్లీ వరి నూర్పిడి పూర్తయ్యే వరకు దాదాపు మూడునెలలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గుట్టలపై, నిజామాబాద్ జిల్లాలోని బాడ్సీ ప్రాంతాలకు వెళ్తారు. మండలాలకు చెందిన గొర్రెల కాపరులు బృందాలుగా ఏర్పడి మందలతో బయల్దేరుతారు. అడవిలో ఉంటూ వాటిని మేపుతూ అక్కడే వంట, భోజనాలు చేస్తారు. రాత్రి మందల వద్దే నిద్రిస్తారు. వంట సామగ్రి కోసం అక్కడి నుంచి కొందరు రావడమో, లేదంటే ఇక్కడి నుంచి వెళ్లేవారు వెంట తీసుకెళ్తారు.

తరచూ ప్రమాదాలు

సుదూర ప్రయాణం రోడ్డు మార్గంలో సాగడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వాహనాలు ఢీకొని జీవాలు చనిపోతున్నాయి. ఇన్సూరెన్సు లేకపోవడంతో కాపరులు నష్టపోతున్నారు. ఇప్పటికైన పశుసంవర్ధక శాఖ అధికారులు పట్టించుకుని జీవాలకు ఇన్సురెన్సు చేసేలా చర్యలు తీసుకోవాలి.

పొలాల్లోనే నిద్ర

మండలంలోని రాజూర గ్రామానికి చెందిన 20 మంది కాపరులు, వట్టోలిలోని 10 కురుమ యాదవ, కుటుంబాల వారు మూడు నెలలు ఇంటికి దూరంగా ఉంటున్నారు. వందలాది కిలోమీటర్లు తిరుగుతూ ఎక్కడ చీకటిపడితే అక్కడే పొలాల్లో నిద్రిస్తున్నారు. సరైన భోజనం, నీటి వసతి లేక ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి జీవాలకు సైతం తాగునీరు లభించని పరిస్థితి. వాగులు, వంకలు అందుబాటులో ఉంటేనే నీరు తాగిస్తున్నారు. తమ గ్రామాల్లో మేత దొరకగానే తిరుగుపయనమతారు.

ఇదే వృత్తిని నమ్ముకున్నాం



ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఏడాదిలో మూడు నెలలు బయటి ప్రపంచానికి దూరంగా ఉంటున్నాం. ఒక్కో మందకు నలుగురు కాపలాగా ఉంటారు. గుట్ట ప్రాంతంలో జీవాలను మేపుతూ తిరుగుతాం. గొర్రెల కాపరులను ప్రభుత్వం పట్టించుకోవాలి. – బరిడే పోతన్న, రాజూర

మేత దొరకక దూరప్రాంతాలకు



ఎస్సారెస్పీ నిండితే జీవాలకు మేత దొరకడం కష్టమవుతుంది. మేత కోసం దూరప్రాంతాలకు జీవాలతో వెళ్తుంటాం. వంట సామగ్రి తీసుకెళ్తాం. అటవీప్రాంతాల్లో జీవాలను మేపుతున్నాం. – గీజాగంగాధర్, ధర్మోర

పొలాల్లో గ్రాసం పెంచుకోవాలి

జీవాలు, పశువుల యజమానులు వారి పంట పొలాల్లో గ్రాసం పెంచుకోవాలి. జీవాలు, పశువులకు ఇన్సురెన్సును చేయించుకోవాలి. గ్రామాల్లో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయిస్తున్నాం. పశువైద్యుల సూచనలు పాటించాలి.

– రాజేశ్వర్, నిర్మల్ పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్

మద్యం షాపుల్లో చోరీ కేసు ఛేదింపు

- వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్


వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్

భైంసాటౌన్:ముధోల్, తానూరులోని మద్యం షాపుల్లో మందు బాటిళ్ల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో శనివారం అదనపు ఎస్పీ అవినాష్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం తాడ్‌బిలోలికి చెందిన యాపరి వినోద్ గ్రామంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. తన బెల్టుదుకాణంలో మద్యం విక్రయం కోసం వైన్స్ షాపుల్లో దొంగతనాలను ఎంచుకున్నాడు. ఇందుకు తన సొంత జిల్లాలో చోరీ చేస్తే దొరికిపోతానని, నిర్మల్ జిల్లాపై ఫోకస్ చేశాడు. తన బెల్టుదుకాణం వద్ద మద్యం తాగేందుకు రెగ్యులర్‌గా వచ్చే బేగరి రోహిత్, సీరడి శ్రావణ్‌కుమార్, ఖదులూరి సాయి, ఆదిత్యగౌడ్, సట్ల నవీన్, దిలీప్‌తో జట్టు కట్టాడు. గత మే నెలలో ముధోల్‌లోని రాజరాజేశ్వర వైన్స్ షాపు వెనుక రేకులు తొలగించి మందు బాటిళ్లు చోరీకి పాల్పడ్డాడు. తానూరులోని శ్రీ లక్ష్మి వైన్స్‌షాపులోనూ అదే తరహాలో చోరీ చేశాడు. ఇలా చోరీ చేసిన మందు బాటిళ్లను తన బెల్టుదుకాణంలో విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఇటీవల మరోమారు అదే తరహాలో చోరీ కోసం ముధోల్‌కు రాగా, అనుమానించిన పోలీసులు వారిని అదుపులో తీసుకున్నారు. ముధోల్‌లో రూ.2.50 లక్షలు, తానూరులోని వైన్స్ షాప్‌ల్లో రూ.80 వేల మద్యం బాటిళ్లను చోరీ చేసినట్లు విచారణలో గుర్తించామన్నారు. నిందితుడి బ్యాంక్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సమావేశంలో ముధోల్ సీఐ మల్లేశ్, ఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడి ఆత్మహత్యకు కారకులపై కేసు నమోదు

వేమనపల్లి: బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆత్మహత్యకు కారకులైన 13 మందిపై పోలీసు కేసు నమోదైంది. రుద్రభట్ల సంతోష్‌కుమార్, గాలి మధు, చింతకింది కమల, చెన్నూరి సమ్మయ్య, షబ్బీర్ అలీ, మంత్రి రమేష్, జడవెల్ల శారద, అద్దెరపల్లి రాజేశ్వరి, మానేపల్లి ప్రమీల, జంపం మారక్క, కొండపల్లి లక్ష్మి, మానేపల్లి మల్లేష్, నాయిని శైలజపై పోలీసులు కేసు నమోదు చేశారు. దసరా వేడుకల సందర్భంగా ఈ నెల 2న కాలనీలో డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకున్నారు. మధుకర్ డయల్ 100కు ఫోన్ చేసి డీజే శబ్దం అసౌకర్యంపై ఫిర్యాదు చేశారు. దీంతో ఆగ్రహానికి గురైన నిందితులు మధుకర్ ఇంటికి వచ్చి అసభ్య పదజాలంతో దూషించారు. కొండపల్లి లక్ష్మి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఏట మధుకర్‌పై ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మధుకర్‌కు నీల్వాయి ఎస్సై ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌కు రావాలని తెలపడంతో మనస్తాపం చెంది శుక్రవారం గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

గుడిహత్నూర్: అక్రమంగా తరలిస్తున్న పశువుల వాహనాన్ని మండల కేంద్ర సమీపంలోని తెలంగాణ దాబా వద్ద శనివారం హైవే పెట్రోలింగ్ సిబ్బంది పట్టుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి ఐచర్ వాహనంలో 27 ఆవులు, 4 ఎడ్లను హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆదిలాబాద్ సమీపంలోని భోరజ్ చెక్‌పోస్టు వద్ద మహిళా అధికారికి అనుమానంతో తనిఖీ చేయడానికి వస్తుండగా డ్రైవర్ ఆపకుండా వెళ్లాడు. ఈ విషయాన్ని హైవే పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్ వెంటనే స్పందించి వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులో తీసుకున్నారు. ఐచర్ వాహనంలో ఉన్న 27 ఆవులు, 4 ఎడ్లను ఇచ్చోడ సమీపంలోని గోశాలకు తరలించారు. కాగా, పోలీసులు అధికారికంగా వివరాలు వెల్లడించలేదు.